www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం ఆగస్టు 11 2024
5
చిత్తూరు



ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం

రాజీలేని పోరాటాలు యుటిఎఫ్‌కే సాధ్యం

ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు



చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) కార్యాలయం వద్ద శనివారం యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని యుటిఎఫ్ పతాకావిష్కరణ జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ మాట్లాడుతూ ఎందరో కార్యకర్తలు, నాయకుల కృషి త్యాగాల ఫలితం, మన ఉద్యమం ప్రాంతాలు, యాజమాన్యాలు, కేడర్ల హద్దులు చెరిపేసి, నిర్బంధాలు, కేసులు, అరెస్టులు అధిగమించి ఎన్నో విజయాలు సాధించామని అన్నారు. అదే స్ఫూర్తితో ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ, హక్కుల సాధన, అమరజీవుల ఆశయాల సాధనకు స్వర్ణోత్సవాల లక్ష్యంగా ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు. నూతన ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని శాస్త్రీయమైన కోణంలో చర్చ జరిపి, గత ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలను, సంస్కరణలను నేటి సమాజ అవసరాల మేరకు ప్రీప్రైమరీలతో కూడిన మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసి, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేవలం చదువు చెప్పడం అనే కోణంలోనే బాధ్యతలు అప్పజెప్పాలని, 117 జీవో రద్దు చేయాలని, ప్రస్తుతం చేపడుతున్న వర్క్ అడ్జస్ట్మెంట్ 53 జీవో ప్రకారం జరపాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు పి.సుధాకర్ రెడ్డి, ఎస్.రెహానా బేగం, కెకె.రెడ్డప్ప నాయుడు, ఎస్‌పి.బాషా, టి.దక్షిణామూర్తి, డి.ఏకాంబరం, పంటపల్లి సురేష్, గణేష్ కుమార్, కె.శేఖర్, భానుప్రకాష్, జి.సుధాకర్, సాధన కుమార్, సునందన్ రెడ్డి, విజయకుమార్, సారథి, చిరంజీవి పాల్గొన్నారు.

కాణిపాకం అగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాలు మండల అధ్యక్షులు సురేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ఉపాధ్యాయ సంక్షేమం కోసం యుటిఎఫ్ రాజీలేని పోరాటాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ప్రభాకర్, అరుణ్ కుమార్, దేవరాజులు, అమ్ములు, రామచంద్ర నాయుడు, జనార్ధన్ పాల్గొన్నారు.



కాణిపాకంలో..



విజయపురంలో..

విజయపురం: రాజీలేని పోరాటం చేయడం యుటిఎఫ్‌కే సాధ్యమని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్ అన్నారు. శనివారం యుటిఎఫ్ స్వర్ణోత్సవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఎంఆర్‌సీ కార్యాలయ ఆవరణంలో యుటిఎఫ్ జెండాను విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.చంద్రయ్య, దొరస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మణిగండన్ మాట్లాడుతూ యుటిఎఫ్ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహిస్తుందన్నారు. పభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా, ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదన్నారు. గడిచిన 50 ఏళ్లలో విద్యారంగానికి, ఉపాధ్యాయులకు ఎన్నో హక్కులను, సౌకర్యాలను సాధించిపెట్టిన ఘనత ఒక్క యుటిఎఫ్‌కే దక్కుతుందన్నారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కే.వంశీకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి రూబన్, మునిచంద్రారెడ్డి, వాసుదేవ వర్మ, జనార్ధన్, హరిప్రసాద్, మని, భాగ్యరాజ్, గోపి, పూర్ణచంద్ర, రామక్రిష్ణ, విజయకుమార్, సుబ్రమణ్యం, పరందామన్, కళ్యాణరామన్, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఇసుక విధానం

గృహ వినియోగదారులపై భారం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రాష్ట్రంలో ఏర్పడిన నూతన తెలుగుదేశం ఉమ్మడి కూటమి ప్రభుత్వం నూతన ఇసుక విధానాన్ని తీసుకొచ్చింది. గత ప్రభుత్వం ఇసుక, మైనింగ్ దోపిడీకి పాల్పడిందంటూ తీవ్ర ఆరోపణలు చేసిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలందరికీ ఉచితంగా ఇసుకను అందిస్తానంటూ ఎన్నికల ముందు ప్రకటించినప్పటికీ అధికారంలోకి వచ్చిన వెంటనే రవాణా ఛార్జీలు మినహా ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌ల నుండి ఇసుకను తీసుకునేందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించింది. తాజాగా నూతన ఇసుక విధానం పేరుతో ఇసుకను తరలించేందుకు రవాణా చార్జీలు ఇసుక రీచుల్లో చెల్లించాల్సిన రుసుములపై స్పష్టత ఇచ్చింది. గృహ వినియోగదారులు ఇసుక కోసం సచివాలయాల్లో రుసుము చెల్లించాల్సి ఉంటుంది. రుసుము చెల్లించిన బిల్లులను ఇసుక రీచ్‌ల వద్ద అందించి ఇసుకను పొందాల్సి ఉంటుంది. చిత్తూరు జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన మేరకు నాగలాపురంలో 12, ఏర్పేడు 2, చిత్తూరు 4 ఇసుక రీచులు అందుబాటులో ఉన్నాయి.

ప్రజా'దృష్టి'

ప్రభుత్వ నిబంధనలు ఇలా..

తెలుగుదేశం ఉమ్మడి ప్రభుత్వం ఇసుక నూతన విధానం ఇలా ఉంది. ఇసుక యార్డుల నుంచి ఇసుకన రవాణా చేసేందుకు ట్రాక్టర్లు ట్రిప్పర్లకు ధరలను నిర్ణయించింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధికంగా వసూలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్, ఇసుక కమిటీ చైర్మన్ హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు పది కిలోమీటర్ల లోపు ఇసుక యార్డ్ నుండి ట్రాక్టర్ ద్వారా (ఐదు టన్నులు) రవాణా కోసం ఇసుక యాడ్ వద్ద రూ.775 రవాణా చార్జీ రూ.1200 చెల్లించాల్సి ఉంటుంది. మొత్తంగా రూ.1,975లు ఐదు టన్నుల ఇసుక కోసం వినియోగదారులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇలా రవాణా దూరాన్ని బట్టి ధరలు మారుతుంటాయి. 25 నుండి 30 కిలోమీటర్ల ఇసుక తరలింపుకు ట్రాక్టర్ ఇసుకకు యాడ్ వద్ద రూ.775 రవాణా చార్జీ 2,000 మొత్తంగా 2,775 రూపాయలు వసూలు చేయనున్నారు. అదే టిప్పర్ల ద్వారా అయితే 10 టన్నుల ఇసుక రవాణా కోసం ఇసుక యాడ్ వద్ద రూ.1,550లు చెల్లించి రవాణా కోసం పది కిలోమీటర్ల లోపు అయితే రూ.1600లు మొత్తం రూ.3,150 చెల్లించాలి. 25 నుండి 30 కిలోమీటర్ల లోపు వరకు ఆరు టైర్ల టిప్పర్ ద్వారా 10 టన్నుల ఇసుక తరలింపు కోసం ఇసుక యాడ్ వద్ద రూ. 1,550 రవాణా చార్జీ 2,800 మొత్తంగా రూ.4,350 చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఇసుక విధానం పేద, మధ్యతరగతి వర్గాలకు గృహ నిర్మాణాలు భారం కానున్నాయి. అలాగే ప్రభుత్వం గృహ నిర్మాణాలకు కూడా నూతన ఇసుక విధానం భారం కానుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చదువులతోపాటు క్రీడల్లో రాణించాలి

గ్రామీణస్థాయి నుండి ఒలంపిక్ స్థాయికి ఎదగాలి: ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి




ప్రజాశక్తి- వి కోట: తెలుగుదేశం పాలనలో క్రీడలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారని విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన వీ కోటలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో శనివారం 7వ అంతర్ జిల్లాల షూటింగ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు ముఖ్యం అతిథిగా ఎమ్మెల్యే విచ్చేసి క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా 16 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారుల చేత గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రీడలకు పెద్దపీట వేశారన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలో స్టేడియంలను నిర్మించి వివిధ క్రీడలకు క్రీడాకారులకు వసతులు కల్పించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మారుమూల ప్రాంతమైన వీకోటలో గత తెలుగుదేశం ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రిగా మినీ స్టేడియం మంజూరు చేసి పునాదులు వేశామని గత ప్రభుత్వం దాన్ని విస్మరించిందన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని అప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకోగలుగుతారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి ఆణిముత్యాలు లాంటి క్రీడాకారులు ఒలంపిక్ స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. షూటింగ్ బాల్ క్రీడలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి క్రీడాకారులకు వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ నరేష్ బాబు చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ మహేష్, అధ్యక్షులు పవన్ కళ్యాణ్, కార్యదర్శి వేణుగోపాల్‌తో పాటు మాజీ ఏఎంసీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, టిడిపి నేతలు రాంబాబు, నాగభూషణం, సుబ్బన్న, ధీరజ్, శబరిష్, విశ్వనాథ్, ఇక్బాల్, పొట్టు భాస్కర్, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విచిత్ర ఆకృతులలో టమోటాలు

ప్రజాశక్తి- సోమల: రైతులు పండించే టమోటా పంటలో ఒక్కోసారి వింత, విచిత్రమైన ఆకృతులతో అక్కడక్కడ కాయలు రాయడం చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అలాంటి ఆకృతులే ప్రజాశక్తి కంటపడటంతో వాటిని ఫోటో తీశారు.





బుద్ధదేవ్ మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు



ప్రజాశక్తి- పలమనేరు: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి వామపక్ష ఉద్యమానికి తీరనిలోటు అని సిపిఎం జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా, ఓబుల్ రాజు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో సిపిఎం కార్యాలయంలో కార్మికులతో కలిసి బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా మాట్లాడుతూ 11 ఏళ్ల పాటు బెంగాల్ ముఖ్యమంత్రిగా సిపిఎం నుంచి బుద్ధదేవ్ పనిచేశారని, ఆయన జీవితం ఆదర్శప్రాయమని, పశ్చిమ బెంగాల్‌కు నిస్వార్థ సేవలు అందించారని తెలిపారు. ఆయన మృతి సిపిఎంకి తీరని లోటు అన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి, సంజయ్ శర్మ, ధనమ్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

వీవోఏలపై వేధింపులు మానుకోకపోతే ఉద్యమం తప్పదు

కుప్పం నియోజకవర్గం సమావేశంలో వక్తల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గంలో విఓఏలపై తీవ్రమైన వేధింపులు ఉన్నాయని వాటిని మానుకోకపోతే ఉద్యమం తప్పదని శనివారం నియోజకవర్గస్థాయి సమావేశంలో వక్తలు హెచ్చరించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, జిల్లా అధ్యక్షుడు జీను రాజశేఖర్, జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన తప్పుదాలే ఈ ప్రభుత్వం కూడా చేస్తున్నదని ఇది సరైనది కాదని తెలిపారు. బైలా రూల్స్ ప్రకారం కాకుండా ఇష్టారాజ్యంగా రాజకీయంగా తొలగించే ప్రయత్నం చేయడం దారుణం అన్నారు. మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ 64ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో సంఘం సభ్యులు ప్రస్తుతం వున్న సంఘమిత్రలకే మద్దతు ఇస్తున్న దౌర్జన్యాలతో నిలిపివేస్తుంటే కొంతమంది అధికారులు వత్తాసు పలకడం ఏమిటని ప్రశ్నించారు. స్కీం వర్కర్స్‌ను వర్కర్స్‌గా గుర్తించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని గుడిపల్లి, రామకుప్పం మండలాల్లో అత్యధికంగా వేధింపులు ఉన్నాయని, రాజకీయ వేధింపులపై జిల్లా కలెక్టర్, పిడి స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన టిడిపి నాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే వేధింపులకు పాల్పడడం ఏమిటి అని ప్రశ్నించారు. తప్పు చేస్తుంటే చర్యలు తీసుకోవాలని రాజకీయ వేధింపులు పాల్పడడం దుర్మార్గమన్నారు. వేధింపులు మానకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో కుప్పం నియోజకవర్గం బాధ్యులు కిరణ్, మంగమ్మ, గుడిపల్లి, రామకుప్పం, శాంతిపురం, కుప్పం వీవోఏలు పాల్గొన్నారు.

సైబర్ కాల్స్ పై అవగాహన కల్పించండి : ఎస్పీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: సైబర్ ఫోన్ కాల్స్‌పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ వీఎన్. మణికంఠ చందోలు తెలిపారు. శనివారం మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ కాల్స్, నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సరిహద్దు రాష్ట్ర మైన తమిళనాడు ఉండడం వలన ఎర్రచందనం, ఇసుక, గ్రానైట్, అక్రమంగా తరలిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రాత్రివేళలో గస్తీ నిర్వహించి గ్రామాలలో ప్రజలకు సైబర్ నేరాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. కార్వేటినగరం సిఐ హనుమంతు, ఎస్సై రాజకుల్లయప్ప సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరం: కొత్తచట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి నేరాలు జరగకుండా చూడాలని చిత్తూరు జిల్లా ఎస్పీ విఎన్. మణికంఠ చందోలు అన్నారు. శనివారం కార్వేటినగరం పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొత్తచట్టాలపై మహిళా పోలీసుల ద్వారా కళాశాల్లో విద్యార్థులకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మైనర్ బాలికలపై జరిగే అఘాయిత్యాలు మోసగించడం, వేధించడంపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఇన్స్పెక్టర్ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి అలాంటి నేరాలు జరగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సర్కిల్ పరిధిలోని క్రైమ్ రేటును తగ్గించాలని, ప్రజలతో స్నేహభావంతో మెలుగుతూ పరిష్కరించాలని ఆదేశించారు. ఈ క్రమంలో భాగంగా పోలీస్టేషన్లో సమస్యలను పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సిఐ హనుమంతప్ప, ఏఎస్ఐ మునికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

'అపోలో'లో జాతీయ స్థాయి వర్క్‌షాప్



అపోలో యూనివర్సిటీలో నిర్వహించిన వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రెండు రోజుల జాతీయస్థాయి వర్క్‌షాపును చిత్తూరు సాంఘిక శాస్త్రం విభాగం, పబ్లిక్ హెల్త్ విభాగం, అపోలో యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ సోషల్ వర్కర్స్ అసోసియేషన్‌తో కలసి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అపోలో యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ హెచ్ వినోద్ బట్ చక్కటి ప్రతిపాదనలకు ఉండేటువంటి ప్రాముఖ్యతను వివరించారు. ప్రతిపాదనలు క్షేత్రస్థాయిలో ఉండేటువంటి సమస్యలను పరిష్కరించేలా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యవక్త డాక్టర్ మణికంఠ ప్రపంచస్థాయి ప్రతిపాదనలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన నైపుణ్యాలు, పరిజ్ఞానాన్ని పాల్గొనే వారికి అందించడం జరిగింది, ఇందులో సమస్యలను గుర్తించటం, సమస్య తీవ్రతను పొందుపరచటం, చక్కటి రిజల్ట్స్ మ్యాట్రిక్స్ తయారు చేయటం, బడ్జెట్‌కు సంబంధించిన కాలవ్యవధి నిర్ణయించటం గురించి వివరించారు. డాక్టర్ మహేంద్ర నాథ్ ప్రసంగిస్తూ యుఎన్ సంస్థలు, జాతీయ స్థాయి సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, సిఎస్ఆర్ సంస్థలు ద్వారా వివిధ నిధుల సమీకరణ ఎలా పొందవచ్చు అని వివరించారు. ఈ వర్క్‌షాపులో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నర్సింగ్, మెడికల్, పబ్లిక్ హెల్త్, లైఫ్ సైన్సెస్, మహిళల అభివృద్ధి సాంఘిక శాస్త్రం వంటి విభాగాల విద్యార్థులు, పరిశోధనా శ్రేణి, విద్యావేత్తలు, అభివృద్ధి నిపుణులు 45 మంది పాల్గొన్నారు. తక్కువ కాలంలో ప్రతి ఒక్కరిచే చక్కటి ప్రపోజల్స్ రాసే ప్రక్రియను చక్కగా వివరించి వారి చేత చేయించారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలోప్రొఫెసర్ సేతు రామసుబ్బయ్య, డాక్టర్ కబీలన్, డాక్టర్ షానీ, డాక్టర్ ప్రవీణ్ హోగర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మ కమలాలు



ప్రజాశక్తి- గుడిపల్లి

మండలం యామగానపల్లి గ్రామంలోని మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు ఇంటి ఆవరణలో ఉన్న బ్రహ్మ కమలం చెట్టుకు శుక్రవారం రాత్రి బ్రహ్మ కమల పుష్పాలు విరబూసి వికసించాయి. దీన్ని చూడడానికి గ్రామస్తులు ఆసక్తి చూపారు.

ట్యాంకు సమస్య.. తీరేదెట్లా..



పెచ్చులూడుతున్న వాటర్ ట్యాంకు

- పెచ్చులూడుతున్న వాటర్ ట్యాంకు
- భయపడుతున్న విద్యార్థులు
- వెంటనే సమస్యను పరిష్కరించాలంటున్న స్థానికులు

ప్రజాశక్తి- వేదురుకుప్పం: ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని స్థానికులు వేడుకుంటున్నారు.. మండలంలోని పచ్చికాపల్లం ఉన్నత పాఠశాలలో సుమారుగా 400 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. రోజూ చుట్టుపక్కల గ్రామాల నుంచి పాఠశాలకు విద్యార్థులు వస్తుంటారు. వారికి తాగునీటి కోసం గతంలో తాగునీటి వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతుంటంతో విద్యార్థులు అటుగా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. దీంతో రక్షిత మంచినీటి పథకం నిరుపయోగంగా మారింది. ట్యాంకుకు అమర్చిన పైపుల అడుగుభాగంలో పెచ్చులూడి కిందపడుతున్నాయి. మోల్డింగ్ అమర్చిన కమ్మీలు సైతం బయటకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ట్యాంకు పక్కనే విద్యార్థుల తరగతి గదులూ ఉన్నాయి. అనుకోని ప్రమాదం జరిగి ట్యాంకు తరగతి గదులపై పడితే పెనుప్రమాదం తప్పదు.. గత నెల ట్యాంకుకు అమర్చిన ఓ వాటర్‌పైపు హఠాత్తుగా కిందపడంతో విద్యార్థులు పెనుప్రమాదం నుంచి తప్పించుకున్నట్లు సమాచారం. కనుక ట్యాంకును పూర్తిగా నేలమట్టం చేసి కొత్త ట్యాంకును కట్టించి విద్యార్థులు ప్రమాదాల భారినపడకుండా చూడాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు స్థానికులు, ఉపాధ్యాయులు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. ఇకనైనా స్పందించి ట్యాంకు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పరిశీలించి పరిష్కరిస్తాం..

-పురుషోత్తం, ఈవోపిఆర్‌డి, వెదురుకుప్పం



పచ్చికాపల్లం ఉన్నత పాఠశాలలో వాటర్ ట్యాంక్ పెచ్చులూడుతున్న సమస్య గురించి తెలిసింది. దీనిపై నివేదికలను పై అధికారులకు అందజేస్తాం. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో వెళ్లి ట్యాంకు పరిస్థితిని పరిశీలించి విద్యార్థులకు ఎటువంటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

ఘనంగా ముగిసిన14వ వార్షిక ఏపీ మెడికాన్ సమావేశాలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాలలో వైద్య విద్య అధ్యాపకులకు, వైద్య విద్యా బోధన విభాగం, రాష్ట్ర వైద్య విద్యా ఉపాధ్యాయుల సంఘం తో అనుసంధానమై (మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్) సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 14వ రాష్ట్ర వ్యాప్త వార్షిక సమావేశం ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా వైద్య అధ్యాపకులకు నేషనల్ మెడికల్ కమిషన్,(న్యూఢిల్లీ) వారి సౌజన్యంతో, 2023-24 లో ప్రవేశ పెట్టిన నూతన వైద్య విద్య బోధనా విధానాలు, వైద్య పరీక్షలకు సంబంధించిన మార్పులు, చేర్పులను గురించి, వైద్య విద్యలో కత్రిమ మేధస్సు గురించి ప్రసిద్ధిగాంచిన వైద్యులు ఉపన్యాసాలు ఇచ్చారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విజయవాడ ఆంధ్ర ప్రదేశ్, కి అనుసంధానంగా ఉన్న ఎస్ వి. వైద్య కళాశాలలో ఈ సదస్సు 11 సంవత్సరాల క్రితం మొదట జరిగింది, ఇప్పుడు 2 వ సారి తిరుపతి వేదిక నిర్వహించారు. వైద్య విద్యా సంచాలకులు (అకాడమిక్) విజయవాడ డాక్టర్ జి.రఘునందన్ మాట్లాడుతూ ఆరోగ్యంలో పెను మార్పులు వస్తున్నందువలన , ఎప్పటికప్పుడు నూతన వైద్య విద్యను వైద్య అధ్యాపకులు తెలుసుకున్నట్లయితే, పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంటుందని తెలిపారు. వైద్య విద్య బోధన గురించి సదస్సులో నూతన మార్పులను గురించి, పాత పద్ధతుల ప్రాముఖ్యతను క్లుప్తంగా వివరించారు. ఎస్వీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వలన వైద్య విద్యా బోధనా పద్ధతుల్లో నూతన మార్పులు వలన కలిగే ప్రయోజనాలు అందరికీ తెలియజేయ గలుగుతున్నమని, పేద రోగులకు మెరుగైన కార్పొరేటు వైద్యం అందించడానికి, ఇలాంటి సమావేశాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ సదస్సులో వివిధ ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్ నుండి సుమారు 400 మంది వైద్య అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు హాజరయ్యారు. దేశ నలుమూలల నుండి ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ పియుష్ గుప్త, డాక్టర్ విష్ణు భట్, డాక్టర్ శంకర్ నచికేత్, డాక్టర్ మహాలక్ష్మి ఉపన్యసించారు. డాక్టర్ కిరీటి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డి.ఎస్.ఎన్ . మూర్తి, డాక్టర్ ప్రతిభ స్రవంతి, డాక్టర్ రామ దేవి, డాక్టర్ ఉమా దేవి, డాక్టర్ మాధవీలత, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ ఫహీం, డాక్టర్ భారతి పాల్గొన్నారు.



ముక్కంటీశా..
నీ భద్రత.. నీదే..!

- 'లోగుట్టు' ముక్కంటికెరుక..!
- పనిచేయని లగేజీ స్కానర్లు
- ఆలయ భద్రత గాలికి
- కనిపించని హ్యాండ్ డిటెక్టర్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తీశ్వరాలయానికి రాహు కేతు పూజల ద్వారా రోజు రోజుకూ ఆదాయం పెరుగుతోంది. అయితే వసతుల కల్పనలో మాత్రం అభివద్ధి కనిపించడం లేదు. ఏడాదికి రూ.150 కోట్ల వార్షికాదాయం పొందుతున్నా భద్రతా చర్యలు శూన్యమనే చెప్పాలి. దాడులు జరిగే అవకాశాలున్నాయని నిఘా అధికారులు పదే పదే హెచ్చరిస్తున్నా భద్రతా వ్యవస్థ డొల్లతనంగా ఉంది. భద్రతాచర్యలు తీసుకోకపోవడంలో లోగుట్టు ముక్కంటికే తెలియాల్సి ఉంది. భద్రత కోసం కొనుగోలు చేసిన పరికరాలు అన్నీ మూలన పడ్డాయి. తూర్పు గోపురం, దక్షిణ గోపురాల వద్ద ఏర్పాటు చేసిన లగేజీ స్కానర్లు అప్పుడప్పుడు మాత్రమే పని చేస్తాయి. మెటల్ డిటెక్టర్లు ఏవీ పనిచేయడం లేదు. చేతి డిటెక్టర్లు కూడా కనిపించడం లేదు. లగేజ్ బ్యాగులు ఆలయంలోకి వెళ్లాలంటే స్కానింగ్ చేసిన తర్వాత తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే స్కానర్లు పనిచేయవు. ఎస్పీఎఫ్, హెూంగార్డులు, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని భద్రత కోసం వినియోగిస్తున్నారు. సెల్ ఫోన్లు, కెమెరాలు, లగేజిలు లోపలకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే ఇది సక్రమంగా అమలు కావడం లేదు. ఏడాదికి సుమారు 150 కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా భద్రత విషయంలో అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం లేదు. సిబ్బంది సంఖ్యను పెంచడంతో పాటు అవసరమైన యంత్రాలను వినియోగించాల్సి ఉంటుంది. భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలని పలువురు అధికారులు నివేదికలిచ్చారు. అయితే నివేదికలు అమలు కావడం లేదు. కరోనా సమయంలో శివలింగం, నంది విగ్రహాలను భక్తులు ఆలయంలోకి తీసుకెళ్లి ప్రతిష్ట చేశారు. ఆ విషమం కొన్ని రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది.

ఈ ఏడాది జరిగిన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు ఒక బాలుడు అర్ధరాత్రి తర్వాత ఆలయంలో నుంచి బయటకు రావడం కలకలం రేపింది. ఇంత జరిగినా విచారణ లేదు. ఎవరిపైనా చర్యలు లేవు. ఇటువంటి భద్రతా లోపాలు చాలానే ఉన్నాయి అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదు. ఏదైనా సంఘటన జరిగిన తర్వాత స్పందించడం, కొన్ని రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మర్చిపోవడం షరా మమూలయ్యింది. అధికారులు ఇప్పటికైనా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

క్రైం న్యూస్

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మనస్థాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని మరణించిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పాతపేట పంచాయతీ పరిధిలో ఉన్న కుప్పనపల్లి గ్రామానికి చెందిన జగదీష్ ఆచారి (42)కి 12 సంవత్సరాల ముందు నవనీతతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెళ్లి జరిగిన కొంతకాలం వీరి సంసారం సజావుగానే సాగింది. కాగా కొన్ని నెలలకు ముందు జగదీష్ నవనీతను కత్తితో నరికాడు.. అనంతరం ఆమె హాస్పిటల్‌లో చికిత్స పొంది భర్తకు దూరంగా పిల్లలతో కలిసి అమ్మవారి ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తుంది. ఈ ఘటనకు సంబంధించి జగదీష్ ఆచారిపై చిత్తూరు కోర్టులో కేసు కూడా నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఇతనికి అనారోగ్య కారణంగా అతని తల్లిదండ్రులు మదనపల్లిలో ఓ హాస్పిటల్‌లో కొన్ని రోజులకు చికిత్స చేయించారు. అతని మానసిక పరిస్థితి సరిగా లేదని వైద్యులు గుర్తించారు. గురువారం ఆసుపత్రి నుంచి ఇంటికి తిరిగి వచ్చారు. శుక్రవారం రాత్రి అందరితో కలిసి భోజనం చేసి పడుకున్నారు. కాగా శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా జగదీష్ ఉరి వేసుకొని మరణించాడు. దీంతో లోకనాథం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు బంగారుపాళ్యం పోలీసులు తెలిపారు. శనివారం మండలంలోని సదకుప్పం గ్రామంలో ధనంజయ నాయుడు కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా హెడ్ కానిస్టేబుల్ బాబు అదుపులో తీసుకొని విచారించి కేసు నమోదు చేశారు. అదేవిధంగా వేపనపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ భార్య సుజాత మద్యం విక్రయిస్తుండగా ఏఎస్ఐ మల్లప్ప అదుపులో తీసుకుని విచారించి కేసు నమోదు చేసి ఇరువురిని కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ప్రజాశక్తి- కుప్పం టౌన్: రాష్ట్ర యువత, ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ముందుకు రావాలని డాక్టర్ కృషిత్ పిలుపునిచ్చారు. శనివారం కుప్పం డిగ్రీ కళాశాలలో యాంటి డ్రగ్స్, టొబాకో సెల్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన డ్రగ్ రహిత భారత్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలను సవివరంగా తెలియజేశారు. అనంతరం కళాశాల ఉపాధ్యక్షులు సాగర్‌రాజు డ్రగ్ రహిత సమాజాన్ని నిర్మించడానికి యువత, విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ కళాశాల విద్యార్థులచే డ్రగ్ రహిత భారత దేశ నిర్మాణానికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. రేడియోగ్రాఫర్ ప్రవీణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం, యాంటి డ్రగ్స్, టొబాకో సెల్ కోఆర్డినేటర్ బాలాజీ కుమార్, కళాశాల అధ్యాపకుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు, రేపు నెల్లిమంద పాలేటమ్మ జాతర

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం నెల్లిమంద పాలేటమ్మ జాతరను ఆదివారం,సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. జిల్లాలోని అత్యంత వైభవంగా భారీ ఖర్చుతో చాందిని బండ్లతో నిర్వహించే పాలేటి అమ్మవారి జాతరను ఆదివారం రాత్రి సోమవారం ఉదయం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు చేస్తున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పోతులు రాజును సోమల పురవీధులలో ఊరేగించారు. నెల్లిమంద పాలేటి అమ్మవారి జాతరను పురస్కరించుకొని చౌడేపల్లి రూరల్ సిఐ ఆధ్వర్యంలో నలుగురు హెడ్ కానిస్టేబుల్‌లో పదిమంది కానిస్టేబుల్‌లతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు ఎస్సై శివశంకర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారని ప్రజలు, భక్తులు, నిర్వాహకులు సహకరించాలని కోరారు.

10 ట్రాన్స్ఫార్మర్లకు మెయింటినెన్స్ పనులు



ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల గ్రామంలోని 10 ట్రాన్స్ఫార్మర్లకు మెయింటినెన్స్ పనులను చేయించినట్టు ఏఈ మహేంద్ర రెడ్డి తెలిపారు. ట్రాన్స్ఫార్మర్లలో చిన్నచిన్న లోపాలను సరి చేయడం, ఆయిల్ మార్చడం, కనెక్షన్ల వద్ద మరమ్మతులు చేసి మెయింటినెన్స్ పనులను నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలలో విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'కాలువలు ఏర్పాటు చేయండయ్యా..!



ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని కేవీశ్రీరామపురం గ్రామంలో మురుగునీటి కాలువలను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మురుగునీటి కాలువ లేకపోవడంతో స్థానిక ప్రజలు వాడే నీళ్లు, వర్షపు నీరు రోడ్డుపై నిలిచి రాకపోకలకు ఇబ్బంది ఉందని తెలిపారు. నీరు నిల్వ చేరడంతో దోమలు, పురుగులు వృద్ధి చెంది అనారోగ్యం పాలవ్వడంతోపాటు దోమల వలన చిన్నపిల్లలకు సరైన నిద్ర లేకుండా పోతుందని ఇప్పటికైన అధికారులు మురుగనీటి కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం




ప్రజాశక్తి- శాంతిపురం

మండలం పరిధిలోని గుండిశెట్టిపల్లిలో క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం టిడిపి కుప్పం నియోజకవర్గ ఇంచార్జ్ పిఎస్.మునిరత్నం క్రికెట్ ఆడి టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చరవాణిలో క్రీడలు ఆడుతున్నారని అలా కాకుండా ప్రతి ఒక్కరు క్రీడా మైదానంలో క్రీడలు ఆడాలని కోరారు. క్రీడలు ఆడటం వల్ల మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్రీడలలో మండల, జిల్లా, రాష్ట్ర, దేశస్థాయిలో రాణించాలని కోరారు. క్రీడల్లో బాగా రాణిస్తే పై చదువులు, ఉద్యోగ అవకాశాలు సులువుగా పొందగలుగుతారని అన్నారు. డాక్టర్ సురేష్ బాబు, గోపీనాథ్, సత్యేంద్ర శేఖర్, డాక్టర్ వెంకటేష్, విజయరామిరెడ్డి, ఉదయ్ కుమార్, వెంకటేష్, రాజేంద్ర అనసూయ, సుగుణమ్మ, ఐటీడీపీ సభ్యులు, గుండిశెట్టిపల్లి పాల్గొన్నారు.


'తెలుగు భాషకు పూర్వవైభవం'

ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు



ప్రజాశక్తి- గంగవరం: తెలుగు భాషా రక్షణకు కృషి చేయాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు శనివారం గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలుకు వినతిపత్రం అందించారు. మాతృభాషా రక్షణకు తాను చేస్తున్న కృషి, కార్యక్రమాల గురించి ఎంపికి వివరించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ తెలుగు భాషకు పూర్వవైభవం వస్తుందని, అందుకు తగిన కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, మురళి, సురేష్, వినోద్ పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే



ప్రజాశక్తి- గంగవరం : మండలం గుండుగల్లులో వెలసివున్న శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా నిర్వాహకులు స్వామివారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి హాజరై పూజాకార్యక్రమాలలో పాల్గొన్నారు. అదేవిధంగా గొర్రెలదొడ్డి గ్రామంలో వెలసి ఉన్న అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి సైతం ఆయన హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం తెలపడంతో పాటు తీర్థ ప్రసాదాలను అందించి సన్మానించారు. టిడిపి మండల అధ్యక్షులు సోమశేఖర గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, రాజన్న, హరి, వెంకటేష్ నాయుడు, గిరిధర్, బత్తిగౌడ్, రాధాకృష్ణ, జయంత్ కుమార్, సోము, జయసింహ పాల్గొన్నారు.

కార్వేటినగరం సీఐగా హనుమంతప్ప



ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎస్.హనుమంతప్ప పదవీబాధ్యలను చేపట్టారు. ఈయన గతంలో కర్నూలు ఎస్‌త్రి పీఎస్లో విధులు నిర్వహిస్తూ బదిలీపై కార్వేటినగరం సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాలను అదుపు చేయడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ నియంత్రణ, అక్రమ వ్యాపారాలపై ఉక్కుపాదం మోపడానికి సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎర్రచందనం, గుట్కా, గంజాయి రవాణాలపై ప్రత్యేక దృష్టి సారించి నియంత్రణకు కృషిచేస్తానని చెప్పారు. సిబ్బంది సిఐ హనుమంతప్పను శాలువలు కప్పి, పుష్ప గుచ్చాలతో ఘనంగా సన్మానించారు.

పారిశుధ్య పనుల పరిశీలన



ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాస రావు పరిశీలించారు. శనివారం పట్టణంలోని రైల్వే రోడ్డు, బస్టాండ్ రోడ్లు, పార్కు, జనసంచారం ఉన్న ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్మికుల చేత పనులను చేయించారు. అదేవిధంగా పట్టణ పరిధిలోని 25 వార్డులలో గత కొన్ని సంవత్సరాలుగా మురికి కాలువలలో చెత్త పేరుకుపోయి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న సమాచారం అందుకున్న కమిషనర్ యంత్రాల సాయంతో కాలువల శుభ్రం చేయించారు. అలాగే బైపాస్ రోడ్డు ప్రక్కనగల పెద్ద కాలువ, సాయిబాబా గుడి పక్కన గల కాలువలను శుభ్రం చేయించారు.

12న ఎస్‌టియు మహా ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పిఎఫ్ ఖాతాల్లో జమకాని కోట్లాది రూపాయల లెక్క తేల్చాలని డిమాండ్ చేస్తూ 12వ తేదీ సోమవారం చిత్తూరు జడ్పీ కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) చిత్తూరు జిల్లాశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మదన్మోహన్ రెడ్డి, బోడే మోహన్ యాదవ్ తెలిపారు. జీతాల నుంచి ప్రతినెలా మినహాయిస్తున్న పిఎఫ్ చందాలు, ఉద్యోగ ఉపాధ్యాయుల ఖాతాలకు సక్రమంగా జమ కావడం లేదని ఆరోపించారు. ఆన్లైన్‌లో పిఎఫ్ స్లిప్పులు అందుబాటులో లేకపోవడం వల్ల, ఎవరి ఖాతాల్లో ఎంత మొత్తాలున్నాయో తెలుసుకోలేక ఆందోళన నెలకొందన్నారు. రుణాలు పొందాలన్నా, పదవీ విరమణ పొందేవారు తుది మొత్తాలు పొందాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

మండల ఇంచార్జ్ ఎంపీడీవోగా రాఘవేంద్ర రాజు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు



మండల ఇంచార్జ్ ఎంపీడీవోగా రాఘవేంద్రరాజు నియమితులయ్యారు. ఆయన ఇప్పటివరకు ఈవోపీఆర్డీగా విధులు నిర్వహించారు. ఉన్నతాధికారులు ఉత్తర్వులు మేరకు శనివారం ఇంచార్జ్ ఎంపీడీవోగా రాఘవేంద్ర రాజు బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా నుంచి వచ్చి ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో భాస్కర్ తిరిగి నెల్లూరు జిల్లాకు వెళ్లారు.

ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రారంభించాలి

మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి- కుప్పం టౌన్



రాష్ట్రంలో తిరిగి ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ను ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ చింతామోహన్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన కుప్పం పట్టణంలో పర్యటించారు. ఈసందర్భంగా పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా అధికారం చెలాయించిన జగన్మోహన్ రెడ్డి అధికారం లేకుండా కేవలం రెండు నెలలు ఉండలేకపోతున్నారని, ప్రస్తుతం రాష్ట్రం శాంతిభద్రతలను కోల్పోయిందని ఆరోపించడం బాధాకరమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చింతా మోహన్ ఇద్దరూ కాంగ్రెస్ పార్టీ నుండి రాజకీయ అరంగేట్రం చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం బాబు కుప్పం నియోజకవర్గ శాసనసభ్యుడిగా ఎనిమిదవ సారి గెలిచి, రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగవసారి పదవి బాధ్యతలు చేపట్టడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీలో బాబును బాహుబలిగా అభివర్ణిస్తారని ఆయన అన్నారు. కుప్పం అభివృద్ధిని విస్మరించారని, గత 40 సంవత్సరాలకు ముందు ఎలా ఉందో కుప్పం పరిస్థితి నేడు కూడా అలాగే ఉందంటూ ఆరోపించారు. ఇప్పటికైనా బాబు కేవలం అమరావతి అభివృద్ధిపై మాత్రమే కాకుండా, తిరుపతి, కుప్పంను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు.

శిలాఫలకం ధ్వంసం హేయమైన చర్య

జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



ప్రజాశక్తి- వి కోట : విజయవాడలో గత వైసిపి ప్రభుత్వంలో నిర్మించిన 125 అడుగుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని హేయమైన చర్యగా జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. విజయవాడ నడిబొడ్డున రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ వైసిపి నేతలు వీకోట అంబేద్కర్ కూడలిలో శనివారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా శిలాఫలకాల ధ్వంసానికి పాల్పడటాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఇటువంటి చర్యలను అడ్డుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహనీయుల జ్ఞాపక చిహ్నాలను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర వైకాపా ప్రధాన కార్యదర్శి పిఎన్ నాగరాజు తెలిపారు. ఎంపీపీ యువరాజ్ , వైస్ ఎంపీపీ తమీం ఖాన్, జిల్లా పరిషత్ సలహాదారుడు ఎస్ఏ గౌస్, బాబు రామకృష్ణ పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు దారి ఏర్పాటు



ప్రజాశక్తి- శాంతిపురం: ఎన్నో సంవత్సరాలుగా దారి లేక ఇబ్బంది పడుతున్న రాళ్ళబూదుగూరు శ్మశాన వాటికకు శనివారం గ్రామపెద్దలు, గ్రామస్తులు చొరవతో ప్రస్తుతానికి మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు. త్వరలోనే ప్రభుత్వం తోడ్పాటుతో శాశ్వత సిమెంటు రోడ్డు పనులను కూడా చేపడతామని తెలిపారు. మండల పరిధిలోని రాళ్ళబుదుగురు మేజర్ గ్రామపంచాయతీకి చెందిన శ్మశానవాటికకు ఎన్నో సంవత్సరాలుగా దారి లేక గ్రామ ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. స్మశాన వాటికకు వెళ్లి ఆఖరి సంస్కారాలను కూడా చేయలేక చాలా ఇబ్బందులకు గురయ్యారు. పండగల వేళ సమాధుల వద్దకు వెళ్లి పూజా కార్యక్రమాలను కూడా నిర్వహించలేని స్థితిలో ఉండేది, కనీసం ఒక ద్విచక్ర వాహనం కూడా రహదారి నుండి స్మశాన వాటికకు వెళ్లలేని దుస్థితిలో స్మశాన వాటిక దారి ఉండేది. స్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయడం వల్ల గ్రామస్తులు రహదారి సమస్య ఇప్పటికి తొలిగిందని సాధ్యమైనంత త్వరగా సిమెంటు రోడ్డు వేసే విధంగా నాయకులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరారు. సర్పంచ్ లక్ష్మి మురుగేష్, ఆర్ఎస్ ముని, జయరాజు, కుమార్, బసవరాజు, మురళి, సురేష్, వాజిత్, సుబ్రమణి పాల్గొన్నారు.

ఎన్డీఏ ఏర్పాటులో రిటైర్ ఉద్యోగుల పాత్ర కీలకం : ఆరణి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటులో రిటైర్డ్ ఉద్యోగుల పాత్ర కీలకమని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నెలవారీ సమావేశం శనివారం తిరుపతిలో జరిగింది. సమావేశం అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సన్మానించారు. అయితే తనకన్నా పెద్దలైన రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించడం సముచితమని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కేఆర్ శంకర్‌ను ఎమ్మెల్యే శాలువ కప్పి సన్మానించారు. ఎమ్మెల్యే చర్యను హర్షిస్తూ రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున కరతాళధ్వనులతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యగులకు మూడు నెలలకు ఒకసారి అన్ని వైద్యపరీక్షలు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. తమకు కేటాయించిన స్థలంలో అక్రమంగా పెన్షర్ల సంఘం పేరిట దౌర్జన్యంగా భవనాన్ని నిర్మించారని ఎమ్మెల్యే దష్టికి రిటైర్డ్ ఉద్యోగులు తీసుకొచ్చారు. దీనిపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బుల్లెట్ రమణ, మునిశేఖర్ రాయల్,రమణరాజు, జనసేన నాయకులు రాజా రెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

